నరక చతుర్దశి నిజమా?

శ్రీకృష్ణుడు ఏకపత్నీవ్రతుడు!?

భారతీయ ఇతిహాసంలో శ్రీరామ శ్రీకృష్ణు లిరువురు అద్వితీయ మహాపురుషులుగా, ఆదర్శ పురుషులుగా, యుగ పురుషులుగా కీర్తింపబడ్డారు. త్రేతాయుగం నాటి శ్రీరాముని మూర్తీభవించిన ధర్మమూర్తిగా ఆబాలగోపాలం, పండితుల నుండి పామరుల వరకు ఆరాధిస్తారు. అతడు ఏకపత్నీవ్రతుడనీ, సీతారాముల దాంపత్యం తరతరాలకు ఆదర్శంగా సృష్టి ఉన్నంతకాలం ప్రజల మనస్సులలో నిలిచిపోతుందనీ కొనియాడతారు. కానీ, శ్రీకృష్ణుని విషయం వచ్చేసరికి అది మరొకరకంగా మారిపోయింది. ఒక ప్రక్క అతడు దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసిన మహాపురుషుడనీ, ఆదర్శ యుగపురుషుడనీ, దేవుని అవతారమేననీ కీర్తిస్తూ మరొకప్రక్క అతడు బహుపత్నీకుడంటారు. అతనికి 8 మంది భార్యలున్నారనీ, నరకాసురుడు చెరబట్టిన 16,000 మంది కన్యలను విడిపించి వారందరినీ తానే పెండ్లాడాడనీ అంటారు. ఇంతేగాక కృష్ణుడు తన మేనత్త రాధతోనూ, అనేకమంది గోపికలతోనూ, చివరకు కుబ్జ దాసితో కూడా జారత్వం జరిపాడంటారు. వివేకవంతులు ఇదేమి ఆదర్శమని నిలదీస్తే కాస్త సర్దుకుని – 'లేదు లేదు ఆ కథలన్నీ కొన్ని ఆధ్యాత్మిక విషయాలు సామాన్య ప్రజలకు అర్థం కావటానికి వ్రాసిన ఆలంకారిక కథలంటారు. ఇందులో ఏది సత్యం? భక్తునికీ భగవంతునికీ పతీపత్ని సంబంధం, జారత్వ సంబంధం ఏ వేదంలో ఉంది? వేదాలలో లేని సంబంధాలు ప్రామాణిక మెట్లవుతాయి?

కొంతమంది చరిత్రకారులు శ్రీకృష్ణ చరిత్రపై చాలా పరిశోధనలు చేశారు. విస్తృత అధ్యయనాలు చేశారు. ఎన్నో పుస్తకాలు వ్రాశారు. వీరిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు. వీటన్నిటిని సమీక్షించి మహాభారతంలో వివరించిన శ్రీకృష్ణ చరిత్రయే సత్యమైనదన్నారు. పురాణాలలోనివన్నీ కట్టుకథలన్నారు. 'నానీకీ కహానియా' (నానమ్మకథ) లన్నారు.

మనం వ్యాస మహాభారతాన్ని పరిశీలించి చూస్తే శ్రీకృష్ణునికి రుక్మిణీ, సత్యభామా, జాంబవతి ముగ్గురు భార్యలున్నట్లు కనబడతారు. కానీ, ఇది కూడా సత్యం కాదంటారు మన జాతీయగీతం "వందేమాతరం......." వ్రాసిన శ్రీ బంకించంద్ర ఛటోపాధ్యాయ గారు. వారు గొప్ప దేశభక్తులేకాక ఆధ్యాత్మిక చింతకులు, పరిశోధకులు, కవులు, రచయితలు. శ్రీకృష్ణుని విషయంలో ఇంత వైవిధ్య కల్పనలు ఎలా వచ్చినవని పరిశోధనలు జరిపారు. మహాభారతాన్నీ భాగవత బ్రహ్మవైవర్త విష్ణుపురాణాదులను, దేశ విదేశీయులు వ్రాసిన శ్రీకృష్ణ చరిత్ర గ్రంథాలను జాగ్రత్తగా అధ్యయనం చేసి విశ్లేషిస్తూ "శ్రీకృష్ణ చరిత్ర" పేరుతో ఒక చక్కటి గ్రంథం వ్రాశారు. దానిలో ఆయన శ్రీకృష్ణుని బహువివాహాల విషయంలో తన నిర్ణయాన్ని గురించి ఈ విధంగా వ్రాశారు –

"మహాభారతంలోని మూల అంశాలనుబట్టి చూస్తే రుక్మిణీ తప్ప కృష్ణునకు మరొక భార్య లేనట్లు ప్రమాణాలు కనబడుతున్నాయి. రుక్మిణీ సంతానమే తరువాత రాజసింహాసనాన్ని అధిష్ఠించెను. వేరొక భార్యకు పుట్టిన వారెవరు కనబడరు. కనుక, శ్యమంతకమణితో ఆయనకు సత్యభామాది స్త్రీలు లభించినారనుట, నరకాసురుని 16 వేల రాణులను కూడా పెండ్లాడాడనుట నానమ్మ కథలే (కల్పిత కథలే), ఈ కథలు చదివి మనోరంజనం పొందవలసిందేగాని నమ్మదగినవి కావు" అని వ్రాశారు.

పురాణకర్తలు శ్రీకృష్ణుని ఏకపత్నీవ్రతంతో సంతోషించక ఆయనకు ఎనిమిదిమంది పట్టపురాణులున్నారని కథలనల్లారు. భాగవతంలో రుక్మిణిగాక సత్యభామ, జాంబవతి, కాళింది, సత్య, లక్ష్మణా, మిత్రవృన్దా, భద్రా అనే పేర్లతో మరొక ఏడుగురు భార్యలున్నట్లు వ్రాయబడింది. వీరితో శ్రీకృష్ణునకు వివాహాలు జరిగిన కథలను కల్పించి వ్రాశారు. కృష్ణుడు ప్రాగ్జ్యోతిషపురం రాజైన నరకాసురుని చంపి 16 వేలమంది అతని స్త్రీలను వివాహమాడినట్లు భాగవతంలోని 59వ అధ్యాయంలో ఉంది. ముందుగా నరకాసురుని సేనాపతి 'ముర' అనే వానిని చంపినందున కృష్ణునకు 'మురారి' అనే పేరు వచ్చిందట.

ఈ ఘట్టాన్ని బంకించంద్రుల వారు విశ్లేషిస్తూ శ్రీకృష్ణుని కాలంలో ప్రాగ్జ్యోతిషపురానికి రాజు నరకాసురుడు కాదు, 'భగదత్తుడు' అన్నారు. ఆ భగదత్తుడే మహాభారత యుద్ధంలో దుర్యోధనుని పక్షంలో యుద్ధంచేసి అర్జునుని చేతిలో

మరణించాడన్నారు. కావాలంటే మహాభారతాన్ని చదివి చూసుకోండన్నారు. జాంబవతీ సత్యభామ విషయం ప్రస్తావిస్తూ అయినా, ఎలుగుబంటికి మానవకన్య ఎలా పుడుతుంది? జాంబవతే కల్పితమైతే సత్యభామ కూడా కల్పితమే కదా! అన్నారు. పంజాబ్ కేసరి శ్రీ లాలా లజపతిరాయ్ గారు కూడా ఒక శ్రీకృష్ణ చరిత్ర వ్రాశారు. అందులో వారు తమ అంతిమ నిర్ణయాన్ని ఈ విధంగా వ్రాశారు –

"ప్రపంచంలో మహాపురుషులపై అనేకమంది విరోధులు అసత్య ఆరోపణలు చేశారు. కానీ, మహాపురుషుడైన శ్రీకృష్ణునిపై ఆయన భక్తులే అనేక దోషారోపణలు చేశారు. శ్రీకృష్ణుడు భక్తుల అనేక ఆరోపణలకు ఎరగా అయిపోయాడు. ఇప్పటికీ అనేక ఆరోపణలు చేస్తూనే వున్నారు. సాధారణంగా శ్రీకృష్ణుడే క్రొత్త క్రొత్త అవతారాలను ధరిస్తాడంటారు. శ్రీరాముడు అవతారాలను ధరిస్తాడని ఎప్పుడైనా విన్నామా? వీరిరువురూ విష్ణువు అవతారాలేనంటారు. ఏమిటీ ఈ విచిత్రం?" అన్నారు. ఇంకా –

"శ్రీకృష్ణుని వంటి వ్యక్తి ఈ దేశమందేకాక ప్రపంచంలో మరెక్కడా ఇంతవరకు జన్మించలేదు. ఆర్యమర్యాద రక్షకుడైన శ్రీరామునితో శ్రీకృష్ణుని వ్యక్తిత్వాన్ని పోల్చవచ్చును కాని వీరిరువురు జీవించిన యుగాలు, ఆ కాలంనాటి జీవన పరిస్థితులు వేరువేరు. శ్రీరాముడు స్వయంగా ఒక ఆదర్శమూర్తియైన రాజు. కానీ శ్రీకృష్ణునకు ఒక ఆదర్శ రాజ్యాన్ని స్వయంగా స్థాపించవలసి వచ్చింది. శ్రీకృష్ణుడు ఎందరో దుష్టులను సంహరించి, సంహరింపచేసి అక్కడ ధర్మాత్ములైన వారిని రాజులుగా చేశాడేకాని తాను రాజు కాలేదు. ఆయన ఆర్య సామ్రాజ్య సంస్థాపకుడు. శ్రీకృష్ణుడెదుర్కొన్న సమస్యలు శ్రీరామునకు లేకుండెను. అందువల్ల ఏవిధంగా చూచినా శ్రీకృష్ణుని చరిత్ర, వ్యక్తిత్వం భూమండలంలో అద్వితీయమే. (అటువంటి వ్యక్తి మరొకరు పుట్టలేదనే చెప్పవచ్చు)" అని వ్రాశారు.

శ్రీ లాజ్‌పతి రాయ్‌గారి పై వాక్యాలు ఇప్పటికైనా మనకు కనువిప్పు కలిగించాలి. "ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య" వంటి సినిమాలు, కథలు, పాటలు వ్రాయకూడదు. పాడకూడదు. భగవద్గీత వంటి జగత్ప్రసిద్ధ ఆధ్యాత్మిక విద్యను చెప్పిన యోగేశ్వర శ్రీకృష్ణునిపై నిందలు మోపకూడదు. ప్రపంచ తత్త్వవేత్తలు,

మేధావులు భగవద్గీత ముందు తలలు వంచారు. అటువంటి మహాపురుషునిపై దోషారోపణలా? మహర్షి దయానందులవారు తమ జగత్ప్రసిద్ధ సత్యార్థ ప్రకాశంలో శ్రీకృష్ణుని గురించి ఎంతో ఆవేదనతో వ్రాసిన ఈ క్రింది వాక్యాలు చదవండి –

"శ్రీకృష్ణుని ఇతిహాసం మహాభారతంలో అత్యుత్తమంగా ఉంది. అతని గుణకర్మ స్వభావాలు, చరిత్ర ఆప్తపురుషుని వంటివి. శ్రీకృష్ణుడు పుట్టింది మొదలు మరణించేదాకా ఏ అధర్మకార్యం చేసినట్లు అందులో కనబడదు. ఈ భాగవతకారుడు అనుచితంగా ఇష్టం వచ్చినట్లు దోషాల నారోపించాడు. పాలు, పెరుగు, వెన్న, మీగడలను దొంగిలించాడనీ, కుబ్జ దాసితో వ్యభిచరించాడనీ, పరస్త్రీలతో రాసమండలంలో క్రీడించినాడనీ, ఇట్టివే మరెన్నో లేనిపోని నిందలు శ్రీకృష్ణునిపై ఆరోపించాడు. అట్టి వాటిని చదువుచు చదివించుచు, వింటూ వినిపించుచు అన్య మతాలవారు శ్రీకృష్ణుని అనేక విధాల నిందిస్తున్నారు. (గేలి చేస్తున్నారు). ఈ భాగవతం వ్రాయబడకుండా వుంటే బాగుండేది. మహాత్ముడైన శ్రీకృష్ణుడు వ్యర్థంగా మిథ్యానిందలపాలు కావలసి రాకుండేది."

– సత్యార్థ ప్రకాశం (11వ సముల్లాసం)

వ్యాసమహర్షి మహాభారత సభాపర్వంలో ధర్మజుని రాజసూయ యజ్ఞాన్ని చక్కగా వర్ణించాడు. యజ్ఞ పరిపూర్తి సమయంలో భీష్ముడు ధర్మరాజును దగ్గరకు పిలిచి, నాయనా! ఈ విశాల సభలో అగ్రపూజకు శ్రీకృష్ణుడే అర్హుడంటూ కృష్ణునిలోని పెక్కు గుణాలను కీర్తిస్తాడు.

శ్లో॥ వేదవేదాంగ విజ్ఞానం బలం చాప్యధికం తథా ।
నృణాం హి లోకే కోఽన్యోస్తి విశిష్టః కేశవాదృతే ॥

– మ.భా.సభాపర్వం 38–19

శ్రీకృష్ణునిలో వేదవేదాంగాల విజ్ఞానం, క్షాత్రబలవీర్యాలు నిండుగా ఉన్నాయి. అట్టి కేశవుని మించిన వ్యక్తి లోకంలో మరెవరూ లేరు అంటాడు.

ఇంతేగాక, కృష్ణునికి రుక్మిణితో వివాహమైన వెంటనే వధూవరులిద్దరు హిమాలయ ప్రాంతంలోని బదరికావనానికి వెళ్ళి 12 సంవత్సరాలు బ్రహ్మచర్య తపస్సు నాచరించారు. అనంతరం సమాగమం సలిపి ప్రద్యుమ్న కుమారుని

కన్నారు. అట్టి స్థితప్రజ్ఞునిపైన దోషారోపణలు చెయ్యటం సబబా! ఆలోచించండి.

శ్రీకృష్ణ జన్మాష్టమి

శ్రీకృష్ణుడు శ్రావణ బహుళ 8 అష్టమినాడు జన్మించెను. ఆయన భారతదేశములో జన్మించిన మహా పురుషులలో ప్రసిద్ధుడు. మహాభారతము నందు వర్ణింపబడిన శ్రీకృష్ణుడు గొప్ప రాజనీతివేత్తగాను, వేదవేదాంగవిదుడుగాను, యోగి పుంగవుడుగాను తెలియనగును. ద్వాపరాంతమున యదువంశమున జన్మించి నాటి దుష్ట రాజులను చంపి, చంపించి, ధర్మస్థాపనకు తోడ్పడినట్లు చరిత్ర వలన తెలియును. కావున భారతీయులు - వైదికులు శ్రీకృష్ణుడు జన్మించిన దినమును పండుగగా జరుపుకొందురు.

ఓం తేజోఽసి తేజో మయిధేహి స్వాహా
ఓం వీర్యమసి వీర్యం మయిధేహి స్వాహా
ఓం బలమసి బలం మయిధేహి స్వాహా
ఓం ఓజోఽస్యోజో మయి ధేహి స్వాహా
ఓం మన్యురసి మన్యుం మయిధేహి స్వాహా
ఓం సహోఽసి సహోమయి ధేహి స్వాహా (యజు. 19-9)